
సాక్షి నారాయణపేట
శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



జూరాలకు మళ్లీ వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద శుక్రవారం మళ్లీ పెరిగింది.

వివరాలు 10లో ▸



జలదిగ్బంధంలో చిన్నోనిపల్లె

రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ వచ్చి చేరుకోవడంతో చిన్నోనిపల్లె జలదిగ్బంధమైంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.7 /21.9

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మార్కెట్ యార్డు దుకాణ సముదాయాలకు టెండర్లు

కోస్గి: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నూతనంగా నిర్మించిన దుకాణాలకు సంబంధించి నెలవారి అద్దెకు ఇచ్చేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి శివశంకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కెట్ కమిటీ నిధులతో తాండూర్ రోడ్డులో నిర్మించిన 9 దుకాణాలకు టెండర్లు నిర్వహించి టెండర్ దక్కించుకున్న వారికి దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఈ నెల 18న నిర్వహించే ఈ టెండర్లకు సంబంధించి 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.2000 **చెల్లించి** దరఖాస్తు ఫారాలు తీసుకోవాలని, **రూ.1 లక్ష** ఈఎండీ మార్కెట్ కమిటీ కార్యదర్శి, **కోస్గి** పేరుతో డీడీలు తీసి ఇవ్వాలన్నారు. **దరఖాస్తు** ఫారం, డీడీ, ఆధార్ కార్డు జిరాక్స్ **జత చేసి** కార్యాలయంలో అందజేయాలన్నారు. **ఇతర** పూర్తి వివరాలకు మార్కెట్ కమిటీ **కార్యదర్శి** 7330733298, పర్సన్ ఇంచార్జి 7330733146 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స




కోస్గి: గత రెండు సంవత్సరాలుగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి కోస్గి ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల బృందం శుక్రవారం అరుదైన ఆపరేషన్ చేశారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం ఇముడాపూర్ గ్రామానికి చెందిన కిష్టప్ప కాళ్లకు సంబంధించి వేరికోస్ వీన్స్ నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి రావడంతో శుక్రవారం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రంజిత్ కుమార్, కోస్గి ఆస్పత్రి సూపరింటెండెంట్ అనుదీప్, వైద్యుడు సాకేత్, సిబ్బందితో కలిసి ఆపరేషన్ చేశారు. జిల్లాలోనే మొదటి సారిగా ఇలాంటి ఆపరేషన్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం శస్త్ర చికిత్స చేసిన కిష్టప్ప ఆరోగ్యంగానే ఉన్నట్లు వారు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవాలి



దామరగిద్ద: అధిక వర్షాలతో పంటలకు సోకుతున్న తెగుళ్లు, చీడ పీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్‌రెడ్డిపల్లి, లోకూర్తి తదితర గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో నీట మునిగిన, చీడపీడలు సోకిన వివిధ పంటలను ఆయన పరిశీలించారు. భారీ వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ముంపునకు గురైన వరి, తదితర పంటలను, వాగులు కాల్వల నీటి ప్రవాహంతో దెబ్బతిన్న పంటలను గుర్తించారు. పంటనష్టం వివరాలను అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. అధిక వర్షాల కారణంగా దెబ్బ తిన్న, లేదా చీడపీడలు సోకిన పంటలను రక్షించుకునేందుకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, వర్షం నీరు పంట పొలాల్లో నిల్వ కుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీఈఓ వెంట మండల వ్యవసాయ అధికారి హరిత, ఏఈఓ నరేష్, స్థానిక రైతులు, శివకుమార్, బాల్‌రాజ్ ఉన్నారు.

కేఎస్పీకి పెరిగిన వరద



దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు మళ్లీ వరద పెరగడంతో 5 గేట్లను తెరిచి నీటి విడుదల చేస్తున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు మండలంలో 4.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం ఒక గేటు తెరిచి నీటిని వదలగా శుక్రవారం ఉదయం ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే పెద్దవాగు ప్రవాహం పెరగడంతో 5 గేట్లను ఒక అడుగు మేర తెరిచి 3,500 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా ప్రస్తుతం 32 అడుగుల మేర నీటి మట్టం ఉంది. నీటి నిల్వను కొనసాగిస్తూ.. పైనుంచి వచ్చిన వరద నీటిని వాగులోకి వదులుతున్నారు.

వినాయకా.. నమో నమః!





ఊరూరా.. వాడవాడలా కొలువుదీరేందుకు బొజ్జ గణపయ్య సిద్ధమయ్యాడు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన భారీ మండపాల్లో నవరాత్రులు భక్తులచే పూజలందుకునేందుకు ముస్తాబయ్యాడు. నారాయణపేట, మక్తల్, కోస్గి, ధన్వాడ, మరికల్ తదితర ప్రాంతాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. తీరొక్క ఫలహారం.. ఉండ్రాళ్ల నైవేద్యం.. భజనలు తదితర కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ సారి మట్టి విగ్రహాలను కూడా ప్రతిష్ఠిస్తున్నారు. శనివారం వినాయకచవితి సందర్భంగా **'సాక్షి' ప్రత్యేక కథనం..**

- నేటినుంచి గణేశ్ చవితి ఉత్సవాలు
- విభిన్న ఆకృతుల్లో కొలువుదీరనున్న లంబోధరుడు
- ముస్తాబైన మండపాలు.. కిటకిటలాడిన మార్కెట్లు



మండపాలను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

నారాయణపేట రూరల్: గణేశ్ నవరాత్రులు వచ్చాయంటే చాలు.. భారీ గణనాథులు.. ఆకట్టుకునే మండపాలు.. రంగు రంగుల విద్యుద్దీపాలతో.. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఈ వేడుకల్లోనే నిమగ్నమవుతారు. జిల్లా వ్యాప్తంగా పల్లె, పట్నం అనే తేడా లేకుండా నేటి వినాయక చవితి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఇంట్లోనే కాకుండా దేవాలయాలు, వివిధ యువజన సంఘాలు ఏర్పాటు చేసిన మండపాల్లో శనివారం గణనాథుడు కొలువుదీరనున్నాడు. నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగు రోజులుగా వివిధ విగ్రహ దుకాణాలు భక్తుల కోలాహలంతో కిక్కిరిశాయి. వివిధ రకాలైన మూర్తులు అందుబాటులో ఉండటంతో వారి అభిరుచికి నచ్చినట్లు కొనుగోలు చేస్తున్నారు. సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేవిధంగా రూపొందించిన కళాకృతులు ఎంతో ఆకట్టుకున్నాయి.

సందడిగా మార్కెట్లు..

విగ్రహాల కొనుగోలు, చవితి ఉత్సవాల పూజా సామగ్రి కొనుగోలుతో నారాయణపేట మార్కెట్ సందడిగా నెలకొంది. కొన్ని చోట్ల మట్టి గణపతులను విక్రయిస్తున్నారు. ఇళ్లలో పూజలు నిర్వహించే మహిళలు మట్టి గణపతుల కొనుగోలుకు ఆసక్తి చూపారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులకు పోలీసులు ఇప్పటికే ముందస్తు సూచనలు చేశారు.

విగ్రహాలకు భలే గిరాకీ..

ముఖ్యంగా జిల్లా కేంద్రంలో వివిధ చోట్ల విగ్రహ విక్రయ కేంద్రాలు ఏర్పాటు కాగా వాటిలో దాదాపు వెయ్యికి పైగా గణనాథుల ప్రతిమలు అమ్ముడుపోయాయి. గత ఏడాదితో పోలిస్తే ఆ సారి విక్రయాల సంఖ్య పెరగడానికి కారణంగా తెలుస్తోంది. ధరలు సైతం 20శాతం మేర పెరిగినట్లు కొనుగోలుదారులు చెప్తున్నారు. దీనికితోడు కుమ్మరివాడలో ప్రత్యేకంగా మట్టి వినాయకుల తయారీ కేంద్రం ఏర్పాటు చేశారు. చాలా చోట్ల విగ్రహాలను పల్లెలకు ఆటోలు, ఇతర వాహనాల్లో భక్తి శ్రద్ధలతో తరలించారు. పూజకు వినియోగించే సామగ్రి కొనుగోలు దుకాణాలు సైతం భక్తులతో రద్దీగా కనిపించింది. ఇప్పటికే మండపాల ఏర్పాట్లు పూర్తి చేసుకోగా, మండపాలు పూర్తిగా కాషాయమయంగా తయారయ్యాయి. విద్యుత్ కనెక్షన్ కోసం ట్రాన్స్‌కో అధికారులు అనుమతి తీసుకోవాలని కోరుతుండగా, మండప నిర్వహణకు స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అన్ని నిబంధనలు పాటించాలని, భక్తి బావం ఉప్పొంగే విధంగా పూజలు జరగాలని వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు తెలియచేస్తున్నారు.

నిమజ్జనం ఎరుగని గణనాథుడు



నారాయణపేట రూరల్: సాధారణంగా ఆలయాలు.. మండపాలు.. ఇళ్లల్లో చవితిరోజు ప్రతిష్ఠించిన వినాయకుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి 5, 9, 11వ రోజుకు నిమజ్జనం చేయడం చూస్తుంటాం. కానీ, నారాయణపేటలోని పళ్లబుజూర్గ్ ప్రాంతంలోని దీక్షిత్ నివాసంలో దాదాపు 700 ఏళ్లకుపైగా గణనాథుడు నిమజ్జనం లేకుండా నిత్యపూజలు అందుకుంటున్నాడు. 13వ శతాబ్దానికి చెందిన గణనాథుడిని నాటి నుంచి వారి కుటుంబసభ్యులు కొలుస్తూ వస్తున్నారు. ఇక యేటా వినాయకచవితి నుంచి 11 రోజులు పెద్ద సంఖ్యలో భక్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు.

ఊరు మొత్తానికి ఒకే వినాయకుడు



జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో పదుల సంఖ్యలో గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. ఆలయాలు మొదులుకుని వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో వినాయకులను ప్రతిష్ఠించి పూజలు చేస్తుంటారు. కానీ నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలో చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఊరంతా కలిసి ఒకే విగ్రహాన్ని ఏర్పాటు చేసి అక్కడే పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరంపర కొనసాగుతుంది. పార్టీలు, కులాలు అనే తేడా లేకుండా ఐకమత్యంగా ఉండాలని ఈ గ్రామస్తులు సందేశం అందిస్తున్నారు.

ఆవంచలో ఏకశిలా గణపతి



దుందుభీ తీరంలో తిమ్మాజిపేట మండలం ఆవంచలో దేశంలోనే ఎత్తైన ఏకశిలా వినాయకుడి విగ్రహం ఉంది. తెలుగు నేలను పాలించిన ఇక్ష్వాకులు గణపతి భక్తులు కావడంతో క్రీ.శ.12వ శతాబ్దంలో దాదాపు 30 అడుగుల ఎత్తైన ఏకశిలా గణపతిని ఏర్పాటు చేసినట్లు చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. స్థానికులు ఐశ్వర్య గణపతిగా పిలిచే ఈ గణనాథుడికి ఆలయం నిర్మాణం జరగకపోవడంతో ఈ విగ్రహం వందల ఏళ్లుగా ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తోంది. వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసేందుకు ఆవంచ గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. - నాగర్‌కర్నూల్



పేటలో విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు



వాహనంలో తరలిస్తున్న భారీ వినాయకుడు

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి



మక్తల్‌లో మినీ ట్యాంకు బండ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

మక్తల్/ఊట్కూరు: గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. శుక్రవారం మక్తల్‌లో గణేష్ రూట్ మార్గ్‌ను, విగ్రహాలను నిమజ్జనం చేసే మినీ ట్యాంకు బండ్‌ను, ఊట్కూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మక్తల్‌లో గణేష్ రూట్‌మార్గ్‌లో విద్యుత్ వైర్లు, రోడ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రార్థన మందిరాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, రోడ్లపై గుంతలు లేకుండా మరమ్మతు చేయించాలని, ట్యాంకు బండ్ వద్ద చెత్తచెదారం లెకుండా శుభ్రంగా ఉంచాలని అన్నారు. చెరువు కట్ట వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మక్తల్ సీఐ చంద్రశేకర్, రాంలాల్, తహసీల్దా సతీస్ కుమార్, ఎస్ఐ బాగ్యలక్ష్మిరెడ్డి, మల్లికార్జున్, రవికుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్‌లో..

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద నిర్వాహకులు పూర్తి స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, రాత్రి సమయంలో వలంటీర్లు తప్పకుండా ఉండాలని, నిమజ్జన సమయంలో చిన్నపిల్లలు, వృద్ధులు రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. శోభాయాత్రలో యువకులు సంయమనం పాటించి ఉత్సవ కమిటీ సభ్యులు ముందుండి యాత్రను కొనసాగించాలని, ఎవరైనా అలజడులు సృష్టిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నిమజ్జనానికి వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, రాంలాల్, ఎమ్మార్వో శ్రీరాజు, ఎంపిడిఓ ధనుంజయగౌడ్, ఎస్ఐ కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ భాస్కర్, సూర్యప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మహిళా సంఘాలకు రూ.1.86 కోట్ల చెక్కును అందజేస్తున్న జోనల్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతానికి.. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రుణాలు ఇవ్వడం జరుగుతుందని జోనల్ జనరల్ మేనేజర్ టీ. శ్రీకాంత్ అన్నారు. మరికల్ యూకో బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 సంఘాలకు కొత్తగా రూ.1.86 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. . మండలంలో 614 సంఘాలు ఉండగా, యూకో బ్యాంకులో మాత్రం 200 సంఘాలు ఉన్నాయని, ఈ సంఖ్య మరింత పెరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ కుట్టు మిషన్లు, రుణాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం కోసం మహిళ శక్తి కింద అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగి రుణబకాయిలను సకాలంలో బ్యాంకులకు చెల్లిస్తే తిరిగి అధిక మొత్తంలో రుణాలు పొందడానికి అవకాశం ఉందన్నారు. బ్యాంకుల నుంచి పొందిన రుణాలను వృథా చేసుకోకుండా వ్యాపారం, పిల్లల చదువుల కోసం ఖర్చు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం శశిభూషన్, యూకో బ్యాంకు మేనేజర్ ఉపేందర్, ఏపీఎం చెన్నప్ప, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు స్వాతి, కార్యదర్శి జ్యోతి, ప్రకాష్, పాష, లక్ష్మి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌లో పైరవీలకు తావులేదు



మద్దూరులో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కడా అధికారి వెంకట్‌రెడ్డి

మద్దూరు: నియోజకవర్గంలోని ప్రజలు పైరవీకారుల అవసరం లేకుండానే ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ పథకాలకు, సీఎంఆర్‌ఎఫ్ నిధుల మంజూరుకు నేరుగా కొడంగల్‌లోని నా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారటీ(కడా) అధికారి వెంకట్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి మండలానికి చెందిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ఉన్న పైరవీ కారులకు ఎలాంటి డబ్బులు అందజేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఉమ్మడి మద్దూరు మండలంలోని 43 మంది లబ్ధిదారులకు రూ. 43 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. అలాగే, ఉమ్మడి మద్దూరు మండల సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని, అవసరమైన ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు.

సమీకృత భవనానికి స్థలం పరిశీలన

మద్దూరులో సమీకృత భవన నిర్మాణం కోసం స్థానిక నాయకులతో కలిసి కడా అధికారి వెంకట్ రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. శిథిలమైన తహసీల్దార్ కార్యాలయాన్ని తొలగించి, పంచాయతీ భవనాన్ని తొలగిస్తే అన్ని కార్యాలయాలకు సంబంధించిన సమీకృత భవనం నిర్మాణం చేపట్టవచ్చని స్థానిక నాయకులు సూచించారు. అలాగే అతిథి గృహం చుట్టూ ప్రహరీ నిర్మాణం, కొత్త భవన నిర్మాణానికి అంచాలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం కొత్త బస్టాండ్, గురుకుల పాఠశాల దగ్గర ఉన్న కాలనీని, పెదిరిపాడ్‌లోని ఊర చెరువును పరిశీలించారు. రెనివట్లలో పాఠశాల విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతులను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సంజీవ్, మల్లీకార్జున్, బాబుస్వామి, సతీష, వెంకట్, లక్ష్మణ్ నాయక్, రహీం, అశోక్ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

- పొంగి పొర్లిన వాగులు.. నిండిన చెరువులు
- పలు గ్రామాల్లో నీట మునిగిన పంటలు

మద్దూరు/మాగనూర్: ఉమ్మడి మద్దూరు మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురియడంతో వాగులు పొంగి పొర్లాయి. చెరువులు నిండి అలుగులు పారాయి. కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం మండలంలో 92.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ శ్రీనివాస్ తెలిపారు. లింగల్‌చేడ్‌లోని పెద్దవాగు బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తుంది. నిడ్జింత వాగు, మద్దూరులోని కాచువాగు, భూనీడ్‌వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మహబూబ్‌నగర్ నుంచి మద్దూరు, భూనీడ్ నుంచి కొత్తపల్లి, భూనీడ్ నుంచి మద్దూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎన్నడూ లేని విధంగా పెదిరిపాడ్ ఊర చెరువు కట్టపై నుంచి పారడంతో చెరువుకు ఎక్కడ గండి పడుతుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. ఈ చెరువును కడా అధికారి వెంకట్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మద్దూరు కాచువాగు ఉధృతంగా పారుతుండడంతో మద్దూరుకు, చింతల్‌దిన్నెకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండంతో వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.



అలుగు పారుతున్న వద్వాట్ పెద్దచెరువు

నీట మునిగిన పంటలు

మాగనూర్: భారీ వర్షాలకు మండలంలోని వరి, పత్తి పంటలు నీటమునగడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వర్షభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయిన రైతులు ఇప్పుడు రూ.లక్షలు ఖర్చు చేసి పంటలు సాగు చేసుకున్న సమయంలో వరుణుడి రూపంలో నష్టం వెంటాడుతోంది. అప్పులు చేసి పంటలు వేశామని.. పంటలు నీటిపాలవడంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థమవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని సర్వే చేసి పైఅధికారులకు నివేదిక పంపించి అదుకోవాలని డిమాండ్ చేశారు.

అలుగు పారిన వద్వాట్ పెద్ద చెరువు

గత వారం రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వానల కారణంగా మండలంలోని వద్వాట్ పెద్ద గ్రామ చెరువు అలుగు పారుతోంది. దీంతో గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే చెరువులు, కుంటలు నిండి అలుగులు పారాయి.



మందిపల్లి శివారులో వరదకు కొట్టుకుపోయిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి



భూనీడ్, కొత్తపల్లి మధ్యలో పారుతున్న వాగు



మద్దూరులోని కాచెరువు వద్ద నీటమునిగిన వరి

క్లుప్తంగా

ట్రాలీ ఆటో కిందపడి చిన్నారి మృతి


కావేరి(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ఆడుకుంటున్న చిన్నారి, ట్రాలీ ఆటో కింద పడి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని పాపయ్యనగర్ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాడూరు మండలం చర్లఇటిక్యాలకి చెందిన మల్లేష్ జిల్లా కేంద్రంలో ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. మల్లేష్ కుమార్తె కావేరి(4) ఇంటి ముందు ఆడుకుంటుంది. అక్కడికి వచ్చిన టాటాఏస్ ట్రాలీ ఆటో డ్రైవర్ గమనించకుండా ఆటోను చిన్నారి పైనుంచి తీసుకెళ్లగా.. చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో డ్రైవర్ ట్రాలీ ఆటోను అక్కడే వదిలేసి పారిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజాపూర్: మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని రాజాపూర్ ఎస్ఐ రవి తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపూర్ నుంచి జడ్చర్ల వైపు వెళ్లే దారిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. సుమారు 50 సంవత్సరాల వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతోనే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే రాజాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అవిఘ్నమస్తు..!

వినాయక చవితి పండగ వచ్చిందంటే చాలు.. వాడవాడలా వినాయక ప్రతిమలు వెలుస్తాయి. ప్రతి గల్లీలో సందడి నెలకొంటుంది.. పిల్లలు, పెద్దలు, మహిళలు, యువత ఇలా అందరూ కలిసి జరుపుకొనే పండుగల్లో వినాయక చవితికి ఎంతో ప్రాధాన్యం ఉంది.. పల్లెలు.. పట్టణాలు, గల్లీల్లో యువత సంఘటితమై గణేష్ ఉత్సవాలు జరుపుకొంటారు. అయితే ఎలాంటి విఘ్నాలు ఎదురవకుండా ప్రశాంతంగా నిర్వహించాలంటే మాత్రం పోలీసుల శాఖ సూచనలు తూ.చ. తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉంది. మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవడం మొదలుకొని.. విద్యుత్, ఫైర్ సేఫ్టీ, ఉత్సవాల ముగింపు నిమజ్జనోత్సవం వరకు ప్రతీది వారి కనుసన్నల్లో ముందుకు సాగితే.. నవరాత్రుల సంతోషం ఏడాదంతా ఉంటుంది. శనివారం వినాయక చవితి నేపథ్యంలో నిర్వహణపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– మహబూబ్‌నగర్ క్రైం/ కల్వకుర్తి టౌన్


కల్వకుర్తిలోని విద్యానగర్‌కాలనీలో నవరాత్రి వేడుకలకు సిద్ధమైన వినాయక మండపం



- మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు తప్పనిసరి
- పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందే
- ప్రతి విగ్రహానికి జియో ట్యాగింగ్
- ఈసారి వేడుకలపై పటిష్ట నిఘా
- నేటినుంచి వినాయక చవితి నవరాత్రులు

వినాయకుడి మండపాలను నిర్మించే సమయంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి. రోడ్డు మధ్యలో మండపాలు నిర్మిస్తే వాహనాల రాకపోకలు, పాదచారులకు ఇబ్బందులు ఎదురవుతాయి. రోడ్డు పక్కనే ఇబ్బంది కలగకుండా నిర్మాణం చేపట్టాలి. గణపతికి నిత్య హారతి, ధూప, దీపం సమర్పిస్తారు. ఇలాంటి సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలి. వీలైతే అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. మండపంలో వెలుతురుకు విద్యుత్ ముఖ్యం. మండపానికి విద్యుత్ లైట్లు అలంకరించే సమయంలో తీగలకు ఎలాంటి అతుకులు లేకుండా నాణ్యమైనవి వాడాలి. మండపాల చుట్టూ సీరియల్ బల్బులతో డెకరేషన్ చేయకూడదు. ఇందుకు ప్రధానంగా వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి. ఒకవేళ ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.

అధిక ధ్వనులు ఇబ్బందికరం

నవరాత్రి ఉత్సవాల్లో భక్తి, భజన గీతాలు, మంత్రోచ్ఛరణాలు, పూజలు చేయడం తప్పనిసరి. అయితే పూజలు జరుగుతున్న సమయంలో డీజేలు, భారీ స్పీకర్లు ఏర్పాటు చేస్తుంటారు. మహబూబ్‌నగర్ పట్టణంలో డీజేలకు అధికారికంగా అనుమతి లేదు. స్పీకర్లు, మైకు ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి. పూజా సమయంలో కాకుండా రోజంతా భక్తి గీతాలు మోగించడంతో పరిసర ప్రాంతాల్లోని చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. కేవలం పూజ జరిగే సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మైకులు వాడుకొని తర్వాత నిలిపివేయాలని పోలీసులు సూచిస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత పూర్తిగా ఆపివేయాలని చెబుతున్నారు.

పోలీసుల బందోబస్తు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గణేష్ మండపాల దగ్గర ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

ప్రత్యేక యూనిక్ ఐడీ

నవరాత్రుల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా, ఇబ్బందులు కలిగించేవి ఉంటే వెంటనే పరిష్కరించడానికి పోలీస్ శాఖ ప్రత్యేక నజర్ పెట్టింది. దీనికి గాను ప్రత్యేకంగా ఒక పోర్టల్ రూపొందించింది. వినాయక మండపాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల నవరాత్రుల ప్రారంభోత్సవం నుంచి శోభాయాత్ర, నిమజ్జనం వరకు తదితర అంశాలను సులువుగా చేపట్టవచ్చని పోలీస్ శాఖ భావిస్తోంది. ఇలా పోలీస్ శాఖ అనుమతులే కాకుండా విద్యుత్, ఫైర్ శాఖల నుంచి పొందిన అనుమతుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం రూపొందించిన https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వగానే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ కనిపిస్తుంది. అందులో వినాయకుడి మంటపం ఏర్పాటు చేసే నిర్వాహకుడి పేరు, పూర్తి వివరాలు, వినాయక మండపం ఏర్పాటు చేసే ప్రాంతం, అది ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందనే వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

సూచనలు పాటించాలి..

వినాయక మండపాల ఏర్పాటులో సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి రూమర్స్ నమ్మరాదని, సందేహాలు ఉంటే సదరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలి. గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ శాఖ ఇచ్చే సూచనలు పాటించాలి. పోలీస్ పోర్టల్ వివరాలను నమోదు చేసుకోవాలి. ఎన్ని విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు అనేది సమాచారం ఉంటే బందోబస్తు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుంది.

– జానకి, ఎస్పీ, మహబూబ్‌నగర్

విద్యుత్‌తో జాగ్రత్త

మండపాల వద్ద విద్యుత్ సరఫరా కోసం గతంలో నిబంధనలను ఉల్లంఘించి తీగలకు వైర్లు వేసేవాళ్లకు ఈసారి దీనికి విద్యుత్ శాఖ చెక్ పెట్టింది. తప్పనిసరిగా మండపాల నిర్వాహకులు విద్యుత్ సరఫరా కోసం అనుమతి తీసుకోవాలని ప్రకటించింది. అనుమతి పొందిన వారికి తామే సరఫరా కల్పిస్తామని, ఇందుకు కనీస చార్జీలు వసూలు చేస్తామని స్పష్టం చేసింది. మండపాల్లో మామూలుగా తీగలు వేలాడేలా ఉంచడం మంచిది కాదు. వర్షపు నీరు పడి విద్యుదాఘాతానికి గాని అగ్ని ప్రమాదానికి గాని దారితీస్తోంది.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికలు)కు చెందిన విద్యార్థినులు జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లో కొనసాగనున్న జాతీయస్థాయి అసోసియేషన్ సబ్ జూనియర్ బాలికల జట్టుకు ఎంపికయ్యారని, వీరు తెలంగాణ తరపున ఆడనున్నారని హెచ్‌ఎం తెలిపారు. ఆగస్టు నుంచి ఈ నెల నాలుగో తేదీ వరకు కల్వకుర్తిలో నిర్వహించిన క్యాంపులో అత్యంత ప్రతిభ కనబర్చిన 22 మందిని ఎంపిక చేయగా.. గోపాల్‌పేట పాఠశాల నుంచి వీరు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అదుపుతప్పి ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని నల్లాలబావి వద్ద శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడిగడ్డతండాకు చెందిన పాండు, సోనా, వెల్దండ మండలం జానలగట్టుతండాకు చెందిన భీమా, మంజుల, రాచూర్‌తండాకు చెందిన సక్రులు కల్వకుర్తి మండలం తర్నికల్‌తండాకు చెందిన బంధువుల ఇంట్లో నిర్వహించిన శుభకార్యానికి గురువారం వెళ్లారు. శుభకార్యం ముగిసిన తరువాత శుక్రవారం తెల్లవారుజామున ఆటోలో హైదరాబాద్ వెళ్తున్నారు. మార్గమధ్యలో వెల్దండలోని నల్లాలభావి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలియజేశారు.

జలదిగ్బంధంలో చిన్నోనిపల్లె


తహసీల్దార్ వాహనాన్ని అడ్డుకున్న చిన్నోనిపల్లె గ్రామస్తులు


చిన్నోనిపల్లె ఇళ్ల మధ్యకు చేరుకున్న రిజర్వాయర్ బ్యాక్‌వాటర్

- గ్రామంలోకి చేరిన రిజర్వాయర్ బ్యాక్‌వాటర్
- తట్టాబుట్టా సర్దుకుంటున్న గ్రామస్తులు
- అధికారుల తీరుపై ఆగ్రహం
- తహసీల్దార్ వాహనాన్ని అడ్డుకుని వెనక్కి పంపిన వైనం

గట్టు: ఇళ్ల ముందుకు రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ వచ్చి చేరుకోవడంతో ఆ ఇళ్లలో ఉండలేక, ఇల్లు విడిచి ఆరుబయట జీవనం సాగించలేక చిన్నోనిపల్లె వాసులు నరకయాతన పడుతున్నారు. ఇది చాలదన్నట్లుగా ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మరింత ఆందోళన చెందుతూ ముంపు గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇంత జరుగుతున్నా.. ముంపు గ్రామస్తులను పలకరించేందుకు అధికారులు, నాయకులు అటు వైపు కన్నెత్తి కూడా చూడక పోవడంతో చిన్నోనిపల్లె వాసులు మరింత ఆగ్రహంతో ఊగిపోతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు చిన్నోనిపల్లె చుట్టూ ఉన్న వాగులు పొంగి, రిజర్వాయర్‌లోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు వచ్చి చేరడంతో రిజర్వాయర్ బ్యాక్ వాటర్ చిన్నోనిపల్లెలోకి చేరుకున్నాయి. ఇప్పటికే కొంత మంది తట్టాబుట్టా సర్దుకుని బతుకు జీవుడా అంటూ కన్నీటితో ఊరికి వీడ్కోలు పలికారు. ఊళ్లోకి రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ రావంటూనే తమను నిండా ముంచారని, కనీసం తల దాచుకునేందుకు కూడా అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. గ్రామంలోని 350 ఇళ్లకు గాను ఇప్పటికే 70 ఇళ్లు నీటిలోకి చేరుకున్నట్లు తెలిపారు. ఆ ఇళ్లలో ఉండే వారు ఇళ్లను ఖాళీ చేసి, మరో చోటుకు చేరుకున్నారు.

అడ్డుకున్న గ్రామస్తులు..

గ్రామంలోకి రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ చేరుకుని మూడు రోజులు గడిచినా.. కనీసం ఎలా ఉన్నారు. ఏం చేస్తున్నారని పలకరించే వారే లేరని, కష్టాల్లో ఉన్న తమను ఆదుకోవాల్సిన అధికారులు ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. గ్రామ పరిస్థితులు తెలుసుకునేందుకు శుక్రవారం గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ సరితారాణి, ఆర్ఐ రాజు వాహనాన్ని గ్రామస్తులు అడ్డుకుని తిప్పిపంపారు.

ఒక్కొక్కరుగా ఊరిని విడుస్తూ...

ఇంకా ఇప్పటి దాకా గ్రామంలో సగం మందికి పునరావాస కేంద్రంలోకి మారేందుకు షిఫ్టింగ్ చార్జీలు చెల్లించలేదు. పునరావాస కేంద్రంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలను కల్పించినప్పటికీ గత్యంతరం లేక చిన్నోనిపల్లె వాసులు ఒక్కొక్కరుగా ఊరిని విడిచిపెడుతున్నారు.

జూరాలకు మళ్లీ వరద

- ప్రాజెక్టుకు 1.36 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 16 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల


ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద శుక్రవారం మళ్లీ పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో ప్రాజెక్టుకు 82 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. శుక్రవారం సాయంత్రానికి 1.36 లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 16 క్రస్ట్ గేట్లు ఎత్తి 1,12,848 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్ల నుంచి ఉత్పత్తి కొనసాగుతోంది. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 30,954 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి 45 క్యూసెక్కులు ఆవిరవుతుండగా.. ఎడమ కాల్వకు 290 క్యూసెక్కులు, కుడి కాల్వకు 185 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.869 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోంది. శుక్రవారం 11 యూనిట్ల నుంచి ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువ 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు.. 139.126 ఎం.యూ., దిగువ 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 108.085 ఎం.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 247.211 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని వివరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మహిళ మృతి


అంజమ్మ (ఫైల్)

కోయిల్‌కొండ: మనికొండకి చెందిన అంజమ్మ(38) గురువారం సాయంత్రం పశువుల కోసం పేర్కివీడు శివారులోని ఓ రైతు పొలంలో గడ్డి కోసుకొని గడ్డిమోపు తలపై పెట్టుకొని వెళ్తుంది. ఈ క్రమంలోనే తీవ్రమైన గాలి, వాన రావడంతో అదే పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి ఎల్‌టీ వైరు తెగి అంజమ్మపై పడటంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

గుంతలో పడి వృద్ధుడు..

హన్వాడ: మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధుడు నీటి గుంతలో పడి మృత్యువాత పడ్డాడు. ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. మండలంలోని గొండ్యాల్‌కు చెందిన చాకలి వెంకప్ప(60) మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లోంచి వేపూర్ వైపు వెళ్లగా.. ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న వేపూర్‌కు చెందిన ఆనంద్ వ్యవసాయ పొలంలోని నీటిగుంతలో పడి మృతిచెందాడు. మృతదేహం పైకి తేలడంతో గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకప్ప భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఉరేసుకుని వ్యక్తి..

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన బాలస్వామి(50) అనే వ్యక్తి ఇంటి వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలస్వామితో తన భార్య స్వరూప నాలుగేళ్ల క్రితం గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో బాలస్వామి తన తండ్రి లక్ష్మయ్యతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో లక్ష్మయ్య గురువారం తన కూతురిని చూడటానికి కుమ్మెర గ్రామానికి వెళ్లాడు. అయితే ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలస్వామి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు శుక్రవారం ఉదయం గమనించి కుటుంబ సభ్యులకు, బంధువులు సమాచారం అందించారు. మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. కాగా బాలస్వామి తన మొదటి భార్య మణెమ్మ మృతి చెందడంతో స్వరూపను రెండో వివాహం చేసుకున్నాడు.